Licensed to post without prepayment wide License No. Ap/HC-14/W PP/2010-2012 &
Registration No. H-HD-GPO/044/2010-2012

Annual Subscription: Rs. 60/- Single Copy: Rs. 5/-

# Tele Light

BSNLEU

*Publisher:* **J. SAMPATH RAO** *Editor:* **P. ASOKA BABU**

**House Journal of B.S.N.L. Employees Union, Andhra Pradesh Circle Branch**

**Vol. No. - 3** **November & December 2011** **Issue - 1**

## ఆంధ్రప్రదేశ్ సర్కిల్‌లో సర్వీసుల మెరుగుదల కోసం సమ్మె నోటీసు ఇచ్చిన బిఎస్ఎన్ఎల్ ఎంప్లాయీస్ యూనియన్, ఎ.పి. సర్కిల్

### సమ్మె నోటీసులోని ముఖ్యాంశాలు

చీఫ్ జనరల్ మేనేజర్, టెలికం (బిఎస్ఎన్ఎల్), హైదరాబాదు గార్కి

అయ్యా!

విషయం: బిఎస్ఎన్ఎల్ సర్వీసుల మెరుగుదలపై మేనేజ్‌మెంటు నిర్లక్ష్యానికి వ్యతిరేకంగా బిఎస్ఎన్ఎల్ ఇయు, ఎ.పి. ఆందోళనా కార్యక్రమాల నోటీసు - గురించి.

ఎ.పి. సర్కిల్‌లోని సెల్‌వన్, బ్రాడ్‌బ్యాండ్ ల్యాండ్‌లైన్ వినియోగదారులకు మెరుగైన సర్వీసులు అందించంలో మేనేజ్‌మెంటు నిర్లక్ష్యానికి వ్యతిరేకంగా బిఎస్ఎన్ఎల్ఇయు, ఎ.పి. సర్కిల్ ఈ క్రింది ఆందోళనా కార్యక్రమాలు నిర్వహించాలని నిర్ణయించింది. మోడెమ్‌లు, ఫోన్ ఇన్‌స్ట్రుమెంట్లు, లాంటి పరికరాల సరఫరాలో లోపాల కారణంగా ప్రస్తుత పోటీ తరుణంలో బిఎస్ఎన్ఎల్ వినియోగదారుల సంఖ్య పడిపోతోంది. దీంతో బిఎస్ఎన్ఎల్‌ను రక్షించుకోవడం కోసం యూనియన్‌కు ఆందోళనా కార్యక్రమం తప్ప మరో మార్గం కన్పించడం లేదు.

### 1) సెల్‌వన్‌రంగం బలోపేతం

ప్రస్తుతం టెలికం రంగంలో ఉన్న పోటీలో వినియోగదారునికి తనకు కావాల్సిన సర్వీసు ప్రొవైడర్‌ను ఎన్నుకునే అవకాశం వుంది. ఎ.పి. సర్కిల్‌లో సెల్‌వన్ రంగం ప్రత్యేక విభాగంగా పరిగణించబడుతోంది. జిల్లాలలోని సాధారణ పరిపాలనా విభాగాలకూ, సెల్‌వన్ విభాగానికి మధ్య సమన్వయ లోపం ఖచ్చితంగా కనిపిస్తోంది. ఇందుకు సెల్‌వన్ విభాగం, సాధారణ పరిపాలనా విభాగంలో లేకపోవడమే కారణం. బిటిఎస్ టవర్ల, ఆప్టిమైజేషన్ తదితర అంశాలను ఎస్ఎస్ఎ అధిపతి పరిధిలో లేకపోవడం వల్ల, సిగ్నల్ వ్యవస్థపై అజమాయిషీ లోపించి సిగ్నల్ లోపాలు ఏర్పడుతున్నాయి. తద్వారా సెల్‌వన్ పై

*15 డిసెంబర్ 2011న ఒకరోజు సమ్మె రాష్ట్రవ్యాప్తంగా సంపూర్ణంగా జరిగింది. అధికారులూ, ఉద్యోగులూ దాదాపు 90% పైగా ఈ సమ్మెను విజయవంతం చేశారు. మేనేజ్‌మెంటూ, ప్రభుత్వం తమ విధానాలను ఈ నిరసనను చూసయినా మార్చుకోవాల్సిన అవసరం ఉంది. మేధావి వర్గం అధికంగా వుండే సర్కిల్ ఆఫీసులో సమ్మె సరిగా జరగలేదు. ఈ మేధావులందరికీ జ్ఞానోదయం కలిగేలా చూడమని కోరదాం. సమ్మె విజయవంతం చేసిన అందరికీ రెడ్ సెల్యూట్స్.*

-బిఎస్ఎన్ఎల్ఇయు

వినియోగదారుల్లో అసంతృప్తి ఏర్పడుతోంది. పీక్ అవర్స్ లో కాల్స్ దొరకకపోవడం, కాల్ కట్ కావడం లాంటి అంశాల మూలంగా కూడా వినియోగదారులు బిఎస్ ఎన్ఎల్ నుండి దూరమవుతున్నారు. ఇందులో ఏమైనా కుట్ర వుందా అన్న కోణంలో కూడా ఆలోచించాల్సిన అవసరం వుంది.

### మోడెమ్‌ల సప్లై

మోడెమ్‌ల సరఫరా డిమాండ్‌కు అనుగుణంగా లేక పోవడం మూలంగా బ్రాడ్‌బ్యాండ్ కనెక్షన్లు ఇవ్వడంలో అంతరాయాలు ఏర్పడి విలువైన వినియోగదారులు బిఎస్ఎన్ఎల్‌కు దూరమవుతున్నారు. దాని మూలంగా బిఎస్ఎన్ఎల్ విలువైన ఆదాయాన్ని కోల్పోతోంది. కనుక మోడెమ్‌ల సరఫరాకు తగిన చర్యలు తీసుకోవాల్సిందిగా కోరుతున్నాం.

### 3) కేబుల్ జాయింటింగ్ కిట్స్, యు-వై కనెక్టర్లు, ఇతర కేబుల్ పరికరాల సరఫరా మెరుగుదల

ప్రస్తుతం బిఎస్ఎన్ఎల్ వద్ద వున్న వినియోగ దారుల్ని నిలుపుకోవాలన్నా కొత్త వినియోగదారుల్ని ఆకర్షించాలన్నా ప్రస్తుతం బిఎస్ఎన్ఎల్ వద్ద వున్న కేబుల్‌ని బాగు చేసుకోవాల్సిన అవసరం వుంది. పాడై పోయిన/బాగు చేయాల్సిన కేబుల్ కోసం యువై కనెక్టర్లు, జాయింటింగ్ కిట్లు మరియు ఇతర పరికరాలు సరఫరా చేసి కేబుల్ వ్యవస్థ మెరుగుదల కోసం వెంటనే కృషి చేయాల్సిన అవసరం ఎంతైనా వుంది.

### 4) ఫోన్ ఇన్‌స్ట్రుమెంట్లు, డ్రాప్‌వైర్ సరఫరా

అనేక సంవత్సరాల క్రితం ఇచ్చిన పాత టెలిఫోన్ల తోనూ పాత డ్రాప్‌వైర్లతోనే వినియోగదారులు బిఎస్ ఎన్ఎల్‌లో కొనసాగుతున్నారు. కొత్తగా లాండ్ ఫోన్ తీసుకునే వినియోగదారునికి కూడా కొత్త ఫోన్ పరికరం ఇవ్వడం లేదు. వినియోగదారులలో నాణ్యతా లోపాల వల్ల కూడా బిఎస్ఎన్ఎల్ లాండ్‌లైన్ కనెక్షన్లు తీసుకో వడం లేదు. కనుక డిమాండ్‌కు అనుగుణంగా డ్రాప్‌వైర్, ఫోన్ ఇన్‌స్ట్రుమెంట్లు సరఫరా చేసేలా ఏర్పాట్లు చేయాలి.

### 5) జనరల్ మేనేజర్ల రొటేషన్ ట్రాన్స్‌ఫర్లు

అనేక జిల్లాలలో జనరల్ మేనేజర్లు అనేక సంవత్స రాలుగా వుండటం మూలంగా, స్థానిక రాజకీయాలలో తల దూర్చటం మూలంగా సమర్థత తగ్గిపోతోంది. కనుక నిర్ణీత కాలపరిమితిని పూర్తి చేసుకున్న జనరల్ మేనేజర్లను వెంటనే ఆయా జిల్లాల నుండి బదిలీ చేయాలి.

### 6) ఒకేచోట చాలాకాలం నుంచి ఉంటున్న అధికారుల బదిలీ

పశ్చిమ గోదావరి, శ్రీకాకుళం, ఒంగోలు లాంటి కొన్ని జిల్లాలలో నాన్ ఎగ్జిక్యూటివ్ క్యాడర్ నుండి ఎగ్జి క్యూటివ్ క్యాడర్‌కు ప్రమోషన్ పొంది గత 30 ఏళ్ళుగా ఒకే జిల్లాలో ఉన్న అధికారులు వున్నారు. వీరంతా స్థానిక యూనియన్ రాజకీయాలలో తల దూరుస్తూ బిఎస్ ఎన్ఎల్ అభివృద్ధి గురించి ఆలోచించటం లేదు. కనుక బిఎస్ఎన్ఎల్ అభివృద్ధి పథంలో నడవాలంటే వారిని బదిలీ చేయాల్సిన అవసరం వుంది.

### 7) కీలకమైన సీట్లలో ఏళ్ళ తరబడి పనిచేస్తున్న అధికారుల బదిలీ

కొన్ని జిల్లాలలో కొంతమంది అధికారులు అనేక సం॥గా కీలకమైన సీట్లలో కొనసాగుతున్నారు. వారిని వెంటనే ఆ సీట్ల నుండి బదిలీ చేయాల్సి వుంటుంది.

### 8) గుర్తింపు యూనియన్ ఇచ్చిన లెటర్లకు రిప్లై

గుర్తింపు యూనియన్ ఇచ్చిన అనేక ఉత్తరాలకు అనేకమార్లు గుర్తుచేసినా ఎలాంటి రిప్లైలూ రావడంలేదు. సంబంధిత అధికారులకు తగిన సూచనలు ఇవ్వాలి.

### 9) ఎల్‌జెసిఎం/ఆర్‌జెసిఎం మీటింగుల నిర్వహణ

నిర్దేశించిన కాలపరిమితికి లోబడి అనేక జిల్లాలలో లోకల్ కౌన్సిల్ మీటింగులు / రాష్ట్ర కౌన్సిల్ మీటింగులు నిర్వహించడంలేదు. కనుక నిర్ణీత కాలపరిధిలో ఈ మీటింగులు నిర్వహించాల్సిందిగా తగిన ఉత్తర్వులు జారీ చేయాలి.

### 10) కారుణ్య నియామకాలలో ఖాళీల భర్తీ

2010-11, 2011-12 సం॥లకుగానూ కొత్త నియామ కాలలో రిలాక్సు చేయబడిన నియామక సూత్రాలను అనుసరించి భర్తీ చేయాల్సిన పోస్టులను గుర్తించి కారుణ్య నియామకాలు చేపట్టాలి.

### ఆందోళనా కార్యక్రమాలు

19-12-2011 - నల్లబ్యాడ్జీలతో గేటువద్ద ప్రదర్శనలు
20-12-2011 - జిల్లాస్థాయిలో ధర్నాలు
27-12-2011 - పత్రికా సమావేశాలు /ర్యాలీలు
06-01-2012 - సర్కిల్ కార్యదర్శిచే సిజిఎం ఆఫీసు వద్ద నిరాహార దీక్ష

## ప్రధానమంత్రిని, ఇతర కమ్యూనికేషన్ల మంత్రులను కలిసిన ప్రైవేట్ టెలికం కంపెనీ ప్రతినిధులు

బిఎస్ఎన్ఎల్ 3జి స్పెక్ట్రమ్ లైసెన్సుని దేశవ్యాప్తంగా అందించటానికిగానూ 10,186 కోట్లు చెల్లించింది.

ఎంటిఎన్ఎల్ ఢిల్లీ, ముంబయ్‌లలో 3జి సర్వీసుల కోసం 6564 కోట్లు చెల్లించింది. ఎయిర్‌టెల్ కంపెనీ 13 సర్కిళ్ళలో 3జి సర్వీసుల కోసం 12295 కోట్లు చెల్లించింది. కానీ 3జి సర్వీసులను ఎయిర్‌టెల్ 20 సర్కిళ్ళలో ఇస్తోంది.

వొడాఫోను 3జి సర్వీసు లకోసం 9 సర్కిళ్ళకుగానూ 11,618 కోట్లు చెల్లించింది. కానీ 20 సర్కిళ్ళలో 3జి సర్వీసులు ఇస్తోంది.

ఐడియా కంపెనీ 11 సర్కిళ్ళకుగానూ 3జి సర్వీసుల కోసం 5796 కట్లు చెల్లించింది. కానీ 19 సర్కిళ్ళలో 3జి సర్వీసులు ఇస్తోంది.

ఇతర ప్రైవేట్ టెలికం కంపెనీలన్నీ ఈ రకంగా ప్రభుత్వానికి తక్కువ డబ్బు చెల్లించి, ఇతర కంపెనీలతో లైసెన్సు అగ్రిమెంట్‌కు విరుద్ధంగా 3జి సర్వీసులు ఇస్తున్నాయి. ఈ రకంగా టెలికం కంపెనీలన్నీ కలిసి 20,000 కోట్లు లైసెన్సు ఫీజుల రూపంలో ఎగవేశాయి.

లైసెన్సు సూత్రాలకు విరుద్ధమైన ఈ చట్ట వ్యతిరేక ఒప్పందంపై డిఓటి ప్రైవేటు టెలికం కంపెనీలకు నోటీసులు ఇచ్చాయి.

అయితే ఈ నోటీసులకు సమాధానంగా ఈ ప్రైవేటు టెలికం కంపెనీలన్నీ బెదిరింపు ధోరణిలో ప్రధానమంత్రికి లేఖ రాశాయి. ఈ లేఖలో 3జి స్పెక్ట్రమ్‌ను వెనక్కు తీసుకొని, తాము చెల్లించిన డబ్బును వడ్డీతో సహా తిరిగి చెల్లించా లనీ అలాగే 3జి నెట్‌వర్కు కోసం తాము చేసిన ఖర్చును కూడా ప్రభుత్వం భరించాలని బెదిరించాయి.

30.11.2011న ఎయిర్‌టెల్, వొడాఫోన్, ఐడియా, రిలయన్సు, టాటా టెలి ప్రతినిధులు కమ్యూనికేషన్ల మంత్రి శ్రీ కపిల్ సిబల్‌ను కలిశారు. ఈ సమావేశం అనంతరం ఈ ప్రతినిధులు ప్రధానిని కలిశారు.

2జి స్కాం తర్వాత ప్రభుత్వరంగ బ్యాంకులు టెలికం కంపెనీలకు ఋణాలు ఇవ్వటం లేదు. ఈ విషయంలో ఋణాలు ఇప్పించేలా సహకరిస్తామని ప్రధాని హామీ ఇచ్చారు. ఈ రకంగా బడ్జెట్‌కి 20,000 కోట్ల నష్టం వాటిల్లినా ప్రభుత్వం ప్రైవేటు టెలికం కంపెనీలనే సమర్థించడం గమనించాలి.

వినవస్తున్న వార్తల ప్రకారం 3జి లైసెన్సులు లేని సర్కిళ్ళలో సైతం కనెక్షన్లు ఇచ్చే టెలికం కంపెనీల వద్ద ఎక్కువ రెవెన్యూ షేరింగ్ విధానాన్ని అమలుచేద్దా మని ప్రభుత్వం యోచిస్తోంది. బిఎస్ఎన్ఎల్ చెల్లించిన 10186 కోట్లు తిరిగి ఇచ్చేసి, ఈ పద్ధతిని బిఎస్ఎన్ఎల్‌కు కూడా అమలుచేస్తే సరిపోతుంది కదా!

## బిఎస్ఎన్ఎల్ అభివృద్ధిని దృష్టిలో వుంచుకొని ఆందోళనా కార్యక్రమాన్ని విరమించుకోవాల్సిందిగా సర్కిల్ మేనేజ్‌మెంటు విజ్ఞప్తి

సర్కిల్ మేనేజ్‌మెంటుకు 28-11-2011న సమ్మె నోటీసును బిఎస్ఎన్ఎల్ ఎంప్లాయీస్ యూనియన్, ఆంధ్ర ప్రదేశ్ సర్కిల్ అందజేసింది. ఇందుకు బదులుగా సర్కిల్ మేనేజ్‌మెంటు లేఖ నెం. బిఎస్ఎన్ఎల్/ఎ.పి./బిఎస్ఎన్ఎల్ఇయు/2011/11, తేది 8-12-2011 ద్వారా సమ్మె నోటీసులో ప్రస్తావించిన అంశాలు కార్పొరేటు స్థాయిలో పరిష్కరించడానికి ప్రయత్నాలు జరుగుతాయనీ, అలాగే 26-12-2011న సమస్యల పరిష్కారం కోసం చర్చలు జరుగుతాయనీ, ఈలోగా సంస్థ బాగోగులను దృష్టిలో వుంచుకొని ఆందోళనా కార్యక్రమాలను విరమించాలనీ మేనేజ్‌మెంటు విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు బిఎస్ఎన్ఎల్ ఎంప్లాయీస్ యూనియన్, ఎ.పి. సర్కిల్ అంగీకరించి 26-12-2011న చర్చల తర్వాత ఆందోళనా కార్యక్రమాన్ని నిర్ణయిస్తుంది.

# ప్రమోషన్ పరీక్షా ఫలితాలలో ఎస్సీ/ఎస్టీ ఉద్యోగులకు ఇచ్చే రిలాక్సేషన్ మార్కుల విధానం బిఎస్ఎన్ఎల్‌లో సక్రమంగా అమలవుతోందా?

డిఓపిటి ఉత్తర్వు నెం. 8/12/69-ఎస్టాబ్లిష్‌మెంట్ (ఎస్‌సిటి), తేది 23.12.1970, ఉత్తర్వు నెం. 36021/10/76, ఎస్టాబ్లిష్‌మెంటు (ఎస్‌సిటి), తేది 21.1.1977 మరియు డిపార్టుమెంట్ ఆఫ్ పర్సనల్ మరియు ట్రైనింగ్ ఉత్తర్వు నెం. 22011/5/86, ఎస్టాబ్లిష్‌మెంటు, తేది 10.4.1989లోని డిపిసి నిబంధనలలోని పేరా 6.3(2) ప్రకారం ఎస్సీ/ఎస్టీ ఉద్యోగులకు ప్రమోషన్ పరీక్షలలోని క్వాలిఫైయింగ్ మార్కులలో రిలాక్సేషన్ విధానం అమలవుతోంది.

పై డిఓపిటి ఉత్తర్వు తేది 23.12.1970ని అనుసరించి డిపార్టుమెంటు నిర్వహించే అంతర్గత పోటీ పరీక్షలలో నిర్ధారించిన క్వాలిఫైయింగ్ మార్కులు రాని ఎస్సీ/ఎస్టీ అభ్యర్థులకు ప్రమోషన్లకూ/కన్ఫర్మేషన్‌కు కూడా పరిగణనలోనికి తీసుకోవచ్చు. అంటే డిఓపిటి ఉత్తర్వు తేదీ 25.7.1970 ద్వారా కల్పించబడ్డ స్టాండర్డ్సు మరింతగా ఎస్సీ/ఎస్టీ ఉద్యోగులకు అనుకూలంగా సవరించబడ్డాయి.

ఇంతేకాకుండా 25.7.1970 నాటి ఉత్తర్వుల ప్రకారం ఉద్యోగాలలో వున్న ఖాళీలలో తగినంతమంది ఎస్సీ/ఎస్టీ ఉద్యోగులు నిర్ధారించిన క్వాలిఫైయింగ్ మార్కులు సాధించలేక, ఖాళీలు మిగిలి వున్న పక్షంలో రిజర్వుడ్ క్యాటగిరీలో వున్న ఈ ఖాళీలను రిలాక్స్ చేయబడ్డ మార్కులతో ఎస్సీ/ఎస్టీ ఉద్యోగులతో భర్తీ చేయాల్సి వుంటుంది. అయితే ఈ ఎస్సీ/ఎస్టీ ఉద్యోగులు ఈ ఉద్యోగాల ఖాళీలు భర్తీకి అర్హత వుంటేనే భర్తీ చేయాల్సి వుంటుంది.

ఈ విధంగా పోటీ పరీక్షలలో కనీస స్టాండర్డ్సు ఎంత వుండాలో అన్నది సెలక్షన్ చేసే బోర్డుకి వదిలి వేశారు. అంతే కాకుండా ఎన్ని ఖాళీలు వున్నాయి, ఎంతమంది ఎస్సీ/ఎస్టీ అభ్యర్థులు వున్నారు అన్న అంశంపై ఆధారపడి ఈ రిలాక్సేషన్‌ను నిర్ణయించాల్సి వుంటుంది.

తదనంతరం డిఓపిటి ఉత్తర్వు నెం. 36021/1సి/76, ఎస్టాబ్లిష్‌మెంటు (ఎస్‌సిటి), తేది 21.1.1977 ద్వారా డిపార్టుమెంటుతో అంతర్గత ప్రమోషన్ల కోసం నిర్వహించే పరీక్షలలో సైతం ఎస్సీ/ఎస్టీ ఉద్యోగులకు మార్కులలో సడలింపు కల్పిస్తూ ఉత్తర్వులు జారీచేయబడ్డాయి. అయితే మిగిలి వున్న ఖాళీలు, అందుబాటులో వున్న అభ్యర్థుల ఆధారంగా ఈ మార్కుల రిలాక్సేషన్‌ను అమలు చేయాల్సి వుంటుంది. పై ఉత్తర్వులు ఆధారంగా డిపార్టుమెంటు ఆఫ్ టెలికం శాఖ పోటీ మరియు క్వాలిఫైయింగ్ పరీక్షలలో గ్రేస్ మార్కులను ఫెయిలైన ఎస్సీ/ఎస్టీ ఉద్యోగులకు కల్పిస్తూ ఉత్తర్వు నెం. 26-2/81-ఎస్‌పిబి-1, తేది 4.5.1981న జారీ చేసింది.

అయితే డిఓటి ఉత్తర్వు నెం. 22-5/91, ఎన్‌ఓజి, తేది 30.11.1992న ఎస్సీ అభ్యర్థులకు కనీసం 20%, ఎస్టీ అభ్యర్థులకు కనీసం 15% మార్కులు వచ్చినవారికి మాత్రమే గ్రేస్ మార్కులు కలపాలని ఆదేశించింది. ఈ డిఓటి ఉత్తర్వులు డిఓపిటి ఇచ్చిన 23.12.1970, మరియు 25.7.1970 నాటి ఉత్తర్వులకు విరుద్ధంగా వుండటం చర్చనీయాంశం. డిఓపిటి ఉత్తర్వుల ప్రకారం ఎస్సీ/ఎస్టీ అభ్యర్థులకు ఎలాంటి కనీస మార్కులు రావాల్సిన అవసరం లేదు. కానీ బిఎస్ఎన్ఎల్‌లో జెటిఓ/జెఎఓ పరీక్షలలో ఎస్సీ/ఎస్టీ అభ్యర్థులకు మరింత కఠిన నిబంధనల్ని అమలుచేశారు. 82వ రాజ్యాంగ సవరణ తర్వాత జులై 1997లో ఉపసంహరింపబడిన పై రిలాక్సేషన్లనన్నింటినీ డిఓపిటి ఉత్తర్వు నెం. 36012/23/96, ఎస్టాబ్లిష్‌మెంట్ (రెసి), వాల్యూమ్-IV, తేది 3.10.2000 ద్వారా పునరుద్ధరించబడ్డాయి.

డిఓపిటి ఉత్తర్వులలో ఎస్సీ/ఎస్టీ అభ్యర్థులకు ఎలాంటి కనీస మార్కులు తెచ్చుకోవాలన్న నిబంధన లేదు. కానీ బిఎస్ఎన్ఎల్ తన అంతర్గత పోటీ పరీక్షలలో కనీస మార్కులను నిర్దేశించింది.

ఈ విధంగా బిఎస్ఎన్ఎల్ ప్రమోషన్ పరీక్షలలో ఎస్సీ/ఎస్టీ అభ్యర్థులకు రిలాక్సేషన్ కల్పించడంలో డిఓపిటి ఉత్తర్వులనే ఉల్లంఘిస్తున్నట్లు అర్థమవుతోంది.

ఈ విషయంలో మరింత లోతైన సమాచారాన్ని, విశ్లేషణాత్మకంగా, ఉత్తర్వులతో సహా ఎవరైనా అందజేయాల్సిందిగా సర్కిల్ యూనియన్ కోరుతోంది.

## ప్రమాదంలో పెన్షన్

# పెన్షన్ ఫండ్ రెగ్యులేటరీ & డెవలప్‌మెంట్ అథారిటీలో విదేశీ పెత్తనం



**ఎం. తారానాథ్,** సహాయ ప్రధాన కార్యదర్శి, బిఎస్ఎన్ఎల్ఇయు, ఆంధ్రప్రదేశ్ సర్కిల్

ప్రభుత్వ ఉద్యోగంలో చేరితే జీవితాంతం ప్రశాంతంగా కనీస మొత్తాన్ని పెన్షనుగా పొందుతూ జీవనాన్ని గడపవచ్చన్న ప్రజల కోర్కెలు 1.1.2004నుండి కల్లలయ్యాయి.

అప్పటిదాకా ప్రభుత్వ ఉద్యోగి పదవీవిరమణ చేస్తే ఉన్న వేతనంలో 50% పెన్షనుగా ప్రభుత్వ ఖజానా నుండి చెల్లించబడేది. అయితే ప్రభుత్వ వ్యయంలో పెన్షన్ చెల్లింపుల ఖర్చు విపరీతంగా పెరుగుతోందనీ, కనుక ఈ పెన్షను ఖర్చును తగ్గించుకోవాలనీ, ప్రభుత్వం తలపోసింది. ఆర్థిక సంస్కరణలలో భాగంగా ప్రపంచ బ్యాంకు ఆదేశానుసారం పెన్షను చెల్లింపులను ప్రభుత్వం కాకుండా ఒక ప్రత్యేక విభాగాన్ని నెలకొల్పి, దానిద్వారా చెల్లించాలని నిర్ణయించారు.

### *పెన్షన్ ఫండ్ రెగ్యులేటరీ అండ్ డెవలప్‌మెంట్ అథారిటీ ఏర్పాటు*

23.03.2003 నాటి ఎన్‌డిఎ ప్రభుత్వ హయాంలో పెన్షను ఫండ్ రెగ్యులేటరీ అండ్ డెవలప్‌మెంట్ అథారిటీ ఏర్పాటైంది. 1882నాటి ట్రస్టుల చట్టంద్వారా పిఎఫ్ఆర్‌డిఎ ఒక ట్రస్టుగా ఏర్పాటైంది. పిఎఫ్ఆర్‌డిఎకు ఒక ఛైర్‌పర్సన్, ముగ్గురు పూర్తికాల సభ్యులు, ఇద్దరు తాత్కాలిక సభ్యులు వుంటారు. 10.10.2003న ప్రభుత్వం ఎగ్జిక్యూటివ్ ఉత్తర్వుల ద్వారా పెన్షను విభాగాన్ని అజమాయిషీ చేసే బాధ్యతని పిఎఫ్ఆర్‌డిఎకి అప్పగించింది.

1.1.04 నుండి కేంద్రప్రభుత్వంలో నియమించబడిన ఉద్యోగులందరూ తమ తమ వేతనాలలో 10% పెన్షను కంట్రిబ్యూషన్‌గా చెల్లించాల్సి వుంటుంది. అంతే మొత్తాన్ని ప్రభుత్వం సమకూర్చుతుంది. ఈ మొత్తాన్ని పిఎఫ్ఆర్‌డిఎతో నియమించబడే పెన్షను ఫండ్ మేనేజర్లు ప్రభుత్వ నిబంధనల మేరకు పెట్టుబడులు పెడతారు. ఈ మొత్తాలపై వచ్చే ఆదాయాన్ని ఉద్యోగి 60 సంవత్సరాలకు పదవీ విరమణ చేసిన తరువాత 60% తిరిగి చెల్లిస్తారు. మిగతా 40% ఉద్యోగి అకౌంట్‌లోనే ఉంటుంది. ఈ మొత్తాన్ని షేర్‌మార్కెట్లలో ఉంచి ఆ మొత్తాలపై వచ్చే ఆదాయాన్ని ఉద్యోగికి పెన్షనురూపంలో చెల్లిస్తారు. దీనినే 'న్యూ పెన్షను స్కీమ్'గా పిలుస్తారు.

ఈ పిఎఫ్ఆర్‌డిఎ పథకం మిలటరీ ఉద్యోగులకు తప్ప మిగతా అందరికీ అమలు చేస్తున్నారు. దేశంలోని అన్ని రాష్ట్రాలు, వామపక్ష ప్రభుత్వాల ప్రభావం ఉన్న కేరళ, వెస్ట్ బెంగాల్, త్రిపుర తప్ప అన్ని రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్నాయి. ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చిన నోటిఫికేషన్ తేదీ నుండి ఆయా రాష్ట్రాలలో, ఆయా రాష్ట్ర ఉద్యోగులకు ఈ పథకం అమలులోకి వచ్చింది.

ఎగ్జిక్యూటివ్ ఉత్తర్వుల ద్వారా అమలులోకి వచ్చిన ఈ పథకం అమలును ప్రభుత్వం ఆర్డినెన్సు జారీ ద్వారా చట్టబద్ధం చేసింది. ఆ తర్వాత పార్లమెంటులో 2005 బిల్లు ప్రవేశపెట్టబడి పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీకి నివేదించబడింది.

ఆంధ్రప్రదేశ్‌లో 22.9.04న పిఎఫ్ఆర్‌డిఎ అమలులోకి వచ్చింది. 1.9.2004 తరువాత రాష్ట్ర ప్రభుత్వం ద్వారా నియమించబడిన ఉద్యోగులకు పిఎఫ్ఆర్‌డిఎ వర్తిస్తుంది.

2005లో పిఎఫ్ఆర్‌డిఎ బిల్లు స్టాండింగ్ కమిటీకి పంపించబడటంతో, బిజెపి నాయకుడు శ్రీ యశ్వంత్ సిన్హా నాయకత్వంలోని కమిటీ ఈ బిల్లుకి కొన్ని మార్పులను సూచించింది.

### *2005 బిల్లుకి, 2011 బిల్లుకి ప్రధాన తేడా ఏమిటి? స్టాండింగ్ కమిటీ సూచనల్ని ప్రభుత్వం ఏం చేసింది?*

1.1.2004లో కేవలం ప్రభుత్వ ఉద్యోగులకు మాత్రమే న్యూ పెన్షను స్కీం అమలుచేశారు. అయితే, 1.5.2009న న్యూ పెన్షను స్కీంను పిఎఫ్ఆర్‌డిఎ 'నేషనల్ పెన్షను స్కీం'గా అమలుచేశారు. 1.1.2004లోని 'న్యూ

పెన్షను స్కీం' కంపల్సరీకాగా, నేషనల్ పెన్షన్ స్కీం ఆప్షనల్. అంటే, 1.5.09 తరువాత దేశంలోని ఏ పౌరుడైనా నెలనెలా కంట్రిబ్యూషన్ చెల్లించడం ద్వారా పిఎఫ్ ఆర్‌డిఎలో సభ్యుడై పెన్షను పొందవచ్చు. దేశంలోని అసంఘటిత కార్మికులకు వయసు మీరినపుడు ఆసరా కల్పించేందుకు ఈ పథకాన్ని అమలుచేసేందుకు ప్రభుత్వం ఉద్దేశించింది.

పిఎఫ్ఆర్‌డిఎ కమిటీలో గతంలో ఉద్యోగులు మరియు స్టేక్ హోల్డర్లకి ప్రాతినిధ్యం లేదు. ప్రస్తుత 2011 చట్టంలో ఉద్యోగులకి, స్టేక్‌హోల్డర్లకు ప్రాతినిధ్యం వుంటుంది.

ప్రస్తుత పిఎఫ్ఆర్‌డిఎ ఒక్క న్యూ పెన్షను స్కీంలో మాత్రమే రూల్సుచేసే అధికారం ఉండగా, కొత్త చట్టంలో అన్నిరకాల పెన్షను స్కీములపైనా రూల్సుచేసే అధికారం పిఎఫ్ఆర్‌డిఎకు ఉంటుంది. ప్రావిడెంటు ఫండు చట్టాన్ని సవరించే అధికారం కూడా పిఎఫ్ఆర్‌డిఎకు ఉంటుంది. 31.3.2011 నాటికి పిఎఫ్ఆర్‌డిఎలో 17 లక్షల సభ్యత్వాలు ఉన్నాయి. ఇందులో 43,000 తప్ప అన్నీ కంపల్సరీ అకౌంట్లే.

గతంలో ఏదైనా పెన్షను పథకం అమలులోకి రావాలంటే ఇన్‌కంటాక్సు డిపార్టుమెంటునుండి పర్మిషన్ తీసుకోవాల్సి వుండేది. కానీ ప్రస్తుత బిల్లులో దీన్ని రద్దు చేశారు.

60 సంవత్సరాలు వచ్చేసరికి అకౌంట్ హోల్డరుకు గరిష్టంగా 60% మాత్రమే తిరిగి చెల్లిస్తారు. అకౌంట్ హోల్డరు ఖచ్చితంగా 40% తిరిగి తీసుకోవాల్సి వుంటుంది.

పెట్టుబడులు ఏయే రంగాలలో పెట్టాలో ఆయా ఫండ్ మేనేజర్లు ఆయా అకౌంట్ల యజమానుల అభీష్టంమేరకు పెట్టుబడులు పెడతారు. పెన్షను ఫండ్ మేనేజర్లుగా, ఎల్ఐసి, ఎస్‌బిఐ, యుటిఐ, ఐడిఎఫ్‌సి, ఐసిఐసిఐ, కొడక్ మహీంద్రా మరియు రిలయన్సు ఎన్నిక కాబడ్డాయి.

## పెన్షను గ్యారెంటీ- సామాజిక భద్రత

పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ పిఎఫ్ఆర్‌డిఎ బిల్లు 2011లో కనీస పెన్షను గ్యారెంటీ ఉండాలనీ, పెన్షను అకౌంట్ నుండి ముందే కొంత మొత్తాన్ని 'విత్‌డ్రా' చేసుకునే సౌలభ్యం కల్పించాలనీ సూచించింది. ఈ రెండు సూచనల్నీ ప్రభుత్వం తిరస్కరించింది. ఎంప్లాయీస్ ప్రావిడెంట్ ఫండ్‌లో కనీసం 8.5% వడ్డీ గత నాలుగు సంవత్సరాలనుండీ చెల్లిస్తున్నారు. షేర్‌మార్కెట్లో పెట్టుబడి పెట్టినపుడు కనీసం ఈ వడ్డీరేటు మేరకు రిటర్న్సు రాకపోతే ప్రభుత్వం ఈ భారాన్ని మోయాల్సి వస్తుందనీ, కనుకనే మినిమం గ్యారెంటీ పెన్షను అన్ని సూచనల్ని అంగీకరించలేమనీ ప్రభుత్వం పేర్కొంటోంది.

అమెరికాలో కూడా 75 గ్యారెంటీ పెన్షను, మిగతా 25 షేర్‌మార్కెట్ ఆదాయాలపై ఆధారపడ్డ పెన్షను వుంది. అయితే ఇది సోషల్ సెక్యూరిటీ టాక్స్ ద్వారా ఉద్యోగుల జీతాలలో రికవరీ చేసిన మొత్తాలలో ఇస్తారు.

ఈ దేశంలో 46 కోట్ల మంది అసంఘటిత కార్మికులు ఉన్నారు. వారందరికీ పెన్షను రూపంలో సామాజిక భద్రత లేదు. ఈ పిఎఫ్ఆర్‌డిఎ బిల్లు ద్వారా అసంఘటిత కార్మికులందరికీ భద్రత కల్పిస్తున్నామనీ ప్రభుత్వం పేర్కొంటోంది. ఇది నిజమా? అసంఘటిత కార్మికులలో అనేకమంది ఉద్యోగాలు మారుతుంటారు. వీరికోసం 'స్వావలంబన' పేరుతో ఏర్పాటయ్యే పెన్షన్ ఫండ్‌లో పెన్షను అకౌంటుదారుడు, పెన్షను చెల్లించకుండా వుంటే ఏం చేయాలి అన్న అంశంలేదు. అలాగే క్లాజు 20(3)(జి) ప్రకారం ట్రేడ్ యూనియన్లు పెట్టుబడులు ఎక్కడ వుండాలో చెప్పడానికి వీలులేదు. 46 కోట్ల మంది అసంఘటిత కార్మికుల డబ్బుతో షేర్ మార్కెట్లకు నిరంతరం ధనం అందడంకోసం ప్రభుత్వం చేస్తున్న కుట్రగానే ఈ పిఎఫ్ఆర్‌డిఎ బిల్లుని భావించాలి.

షేర్ మార్కెట్లలో పెట్టుబడులవల్ల నష్టాలు వచ్చి, కనీసం 8.5% వడ్డీ అన్నా ఇవ్వలేని పక్షంలో ప్రభుత్వంపై భారమవుతుందని వాదిస్తున్న ప్రభుత్వం, నెలకి సగటున 2000/- కూడా వేతనం లేని కార్మికుడు తినీ, తినక దాచుకున్న డబ్బుపై తగిన విలువ వస్తుందో రాదో అన్న అనుమానంతో కార్మికుడు సామాజిక భద్రతని ఎలా ఫీలవుతాడు?

## పిఎఫ్ఆర్‌డిఎలో 26% ఫారిన్ డిజిన్వెస్ట్‌మెంటుకు అనుమతి

2008 నాటి ఆర్థికసంక్షోభంలో అతలాకుతలమైన అమెరికా, ఇతర యూరోపియన్ దేశాలలో బ్యాంకులు దివాళా తీయడంతో పెన్షను ఫండు పథకాలన్నీ గాలిలో కలిసిపోయాయి. అనేకమంది సగటు మానవులు రోడ్డున పడ్డారు. అయినా సరే కళ్లు తెరవని ప్రభుత్వాలు విదేశీ పెన్షను ఫండు మదుపరులను సంతృప్తి పరచడంకోసం పిఎఫ్ఆర్‌డిఎలో 26% ఎఫ్‌డిఐని అనుమతిస్తూ మార్పులు చేస్తోంది. పైగా ఈ ఎఫ్‌డిఐ అనుమతిని బిల్లు రూపంలో కాకుండా ఎగ్జిక్యూటివ్ ఉత్తర్వుల రూపంలో ఇవ్వజూస్తోంది. తద్వారా రాబోయే రోజులలో మరింతగా పెన్షను పథకాలను విదేశీ మదుపరులకు అప్పగించ చూస్తోంది. ఇన్స్యూరెన్సు రంగంలో 26% ఎఫ్‌డిఐని మరింతగా పెంచాలన్న అంశం పార్లమెంటరీ స్థాయీసంఘం దగ్గర ఉండగా, ఇన్స్యూరెన్సు, పెన్షను రంగాలలో మరింతగా ఎఫ్‌డిఐ అనుమతించాలనీ, దానికి పార్లమెంటుకు చట్టాలద్వారా కాకుండా, తన ఇష్టారాజ్యంగా వ్యవహ రింపజూస్తోంది.

## విదేశాలలో పెన్షను ఫండ్స్ ఎలా ఉన్నాయి?

అర్జెంటైనా, బ్రెజిల్, చిలీ, కొలంబియా, పెరూ, ఉరుగ్వే, పోలెండ్, ఉజ్బెకిస్తాన్ లాంటి దేశాలలో పెన్షను ఫండ్ పథకాలు అమలవుతున్నా ఆయా దేశాలన్నీ పెన్షను కనీస చెల్లింపు విధానాలనే అమలుచేస్తున్నాయి. అయితే, ప్రపంచవ్యాప్తంగా ఆర్థికసంక్షోభాలు చుట్టుముడుతున్న కారణంగా పెన్షను ఫండుపై మదుపరులకు వచ్చే ఆదాయాలు ఒకటి, రెండు దేశాలలో మినహా ఎక్కడా ఆశాజనకంగా లేవు.

## ఇంకా ఇందులోని లోపాలేమిటి?

పెన్షను ఫండ్ మేనేజర్లుగా వ్యవహరించేవారు, పెన్షను ఫండ్ అకౌంట్‌దారుల లాభంకోసమే పని చేస్తారనే గ్యారెంటీ లేదు. వాణిజ్యపరంగా లాభాల దృక్పథంతో నడిచే ఈ పెన్షను ఫండ్ మేనేజర్లు షేరుమార్కెట్లు పతనమైనపుడు కాయకష్టంతో దాచుకున్న డబ్బుపై కనీస గ్యారెంటీ లేకపోతే 60 సంవత్సరాల వయసులో మదుపరి జీవితాన్ని ఎలా గడపాలి? పిఎఫ్ఆర్‌డిఎ సర్‌ప్లస్ ఫండ్‌ని కన్సాలిడేటెడ్ ఫండ్‌లో జమచేయాలని 2005 నాటి పిఎఫ్ఆర్‌డిఎలో వుంది. కానీ ఇప్పటివరకూ జమ చేయలేదు. అత్యవసర పరిస్థితులలో మదుపరి ఫండ్ నుండి డబ్బులు విత్‌డ్రా చేసుకునే సౌలభ్యం కల్పించాలన్న పార్లమెంటరీ స్థాయీసంఘం సిఫారుసును కూడా ప్రభుత్వం అంగీకరించలేదు.

విదేశీ, స్వదేశీ పెట్టుబడిదారులకు, అప్పనంగా స్టాక్‌మార్కెట్లకు నెలనెలా నిర్ణీత మొత్తాన్ని పెట్టుబడిగా సమకూర్చే కుట్రలో భాగంగా 46 కోట్లమంది సామాన్య అసంఘటిత కార్మికుల పొట్టకొట్టడమే ఈ బిల్లు లక్ష్యం.

ఏ పెన్షను పథకాన్నైనా మార్చే అధికారాన్ని పిఎఫ్ఆర్‌డిఎకు కట్టబెట్టడం ద్వారా పెన్షను చెల్లింపు బాధ్యతనుండి సంపూర్ణంగా తప్పుకోవాలన్న ప్రభుత్వ దురాలోచనే పిఎఫ్ఆర్‌డిఎ బిల్లు అసలు రూపం.

లక్షలాదిమంది పెన్షనుదారులు 25-11-2011న పార్లమెంటు మార్చ్‌ని జయప్రదం చేసి, ప్రధానమంత్రికి నిరసనను మెమొరాండం ద్వారా సమర్పించారు. ఇప్పటికైనా 'యోగి' మౌనముద్ర వీడుతారా?

## రాష్ట్రంలోని ఏడు జిల్లాలలోని కొన్ని ప్రాంతాలకు బ్యాడ్ క్లైమెట్ అలవెన్సు మంజూరు - బిఎస్ఎన్ఎల్ ఎంప్లాయీస్ యూనియన్ కృషి

రాష్ట్ర కౌన్సిల్‌లో బిఎస్ఎన్ఎల్ ఎంప్లాయీస్ యూనియన్ డిమాండ్‌ను అంగీకరిస్తూ మేనేజ్‌మెంటు ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ఉత్తర్వుల ప్రకారం, విజయనగరం, విశాఖపట్నం, తూర్పు గోదావరి, ఖమ్మం, వరంగల్, ఆదిలాబాద్, మహబూబ్‌నగర్ జిల్లాల లోని నోటిఫైడ్ మండలాలలో పనిచేస్తున్న ఉద్యోగులకు బ్యాడ్ క్లైమెట్ అలవెన్సు మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి.

## బిఎస్ఎన్ఎల్ ప్రభుత్వం నుండి ఆర్థిక సహాయం కోరుతోందా?

బిఎస్ఎన్ఎల్ వద్ద మార్చి 2008 దాకా 40,000 కోట్ల రూపాయల బ్యాంకు నిల్వలు ఉన్నాయి. కానీ ప్రస్తుతం బిఎస్ఎన్ఎల్ వద్ద కేవలం 2500 కోట్ల నిల్వలే వున్నాయి. ఇందులో 840 కోట్లు బ్యాంకు డిపాజిట్లు కాగా మిగతాది రోజువారీ కార్యకలాపాల ద్వారా వస్తున్న ఆదాయమే.

గత సంవత్సరం 1823 కోట్లు నష్టాలు రాగా, ఈ సంవత్సరంలో 6384 కోట్లు నష్టాలు బిఎస్ఎన్ఎల్‌కు వచ్చాయి. కాగా 3జి/బ్రాడ్‌బ్యాండ్ వైర్‌లెస్ యాక్సెస్ లైసెన్సు ఫీజు పేరుతో దాదాపు 18500 కోట్లు ప్రభుత్వానికి బిఎస్ఎన్ఎల్ చెల్లించాల్సి వచ్చింది. 2010-11 ఆర్థిక సంవత్సరంలో ఆదాయం 29687 కోట్లు కాగా ఇందులో 13791 కోట్లు ఉద్యోగుల జీతభత్యాల కోసం ఖర్చవుతోందని కంపెనీ సిఎండి తెలిపారు. కాగా కంపెనీ ఆదాయాలు 2006-07లో 39715 కోట్లు కాగా అది 2010-11 సం॥నికి 29687 కోట్లకు పడిపోయింది.

రకరకాల న్యాయపరమైన, పరిపాలనాపరమైన అడ్డంకుల కారణంగా 2006 నుండి ఇప్పటిదాకా పరికరాల కొనుగోలును బిఎస్ఎన్ఎల్ చేపట్టలేకపోయింది.

ఆర్థికపరమైన చిక్కులు, అడ్డంకులు తప్పించుకోవడానికి బిఎస్ఎన్ఎల్ ప్రభుత్వం నుండి ఆర్థిక సహాయం కోరే ఆలోచనలో వున్నట్లు తెలుస్తోంది.

కాగా బ్రాడ్‌బ్యాండ్ వైర్‌లెస్ యాక్సెస్ స్పెక్ట్రమ్‌ను కొన్ని సర్కిళ్ళలో అక్కరలేదని బిఎస్ఎన్ఎల్ సరెండర్ చేసింది. దీనికోసం బిఎస్ఎన్ఎల్ చెల్లించిన 8500 కోట్లలో దాదాపు 7316 కోట్లు తిరిగి బిఎస్ఎన్ఎల్‌కు చెల్లించడానికి డిపార్ట్‌మెంట్ ఆఫ్ టెలికం శాఖ సూత్ర ప్రాయంగా అంగీకరించింది. ఈ రూపేణా బిఎస్ఎన్ఎల్‌కు కొంత మేరకు ఆర్థిక వెసులుబాటు లభించే అవకాశం వుంది.

*టైమ్స్ ఆఫ్ ఇండియా, 5-12-2011*

## బిఎస్ఎన్ఎల్‌కు మెడికల్ బిల్లుల రూపేణా 548 కోట్లు ఖర్చు

2009-10 ఆర్థిక సంవత్సరంలో 1823 కోట్లు నష్టం బిఎస్ఎన్ఎల్‌కు రాగా, 2010-11 ఆర్థిక సంవత్సరంలో 6384 కోట్లు నష్టం వచ్చింది.

బిఎస్ఎన్ఎల్‌కు వస్తున్న ఆదాయాలు ప్రతి సంవత్సరం గణనీయంగా తగ్గిపోతుండగా, మరోవైపు ప్రైవేటు టెలికం కంపెనీలైన వొడాఫోన్ ఆదాయం 2010లో 2370 కాగా, 2011లో ఈ ఆదాయం 30,000 కోట్లకు పెరిగింది. అలాగే రిలయన్సు, ఎయిర్‌టెల్ ఆదాయాలు కూడా చెప్పుకోతగ్గ స్థాయిలో పెరిగాయి.

బిఎస్ఎన్ఎల్‌ను బలోపేతం చేయాలని ఆదాయ మార్గాలను సమకూర్చుకోవడానికి, అనవసర ఖర్చును తగ్గించడానికి, బ్రాడ్‌బ్యాండ్ ద్వారా ఆదాయాన్ని మరింతగా పెంచుకోవడానికి, ప్రభుత్వ ప్రాజెక్టులను చేపట్టడం ద్వారా దేశంలోని 100 పట్టణాలలో మరిన్ని సేవలు అందించడం ద్వారా, వాల్యూయాడెడ్ సర్వీసుల ద్వారా ఆదాయం సంపాదించాలని ప్రభుత్వం బిఎస్ఎన్ఎల్‌కు సూచించింది.

సామాజిక బాధ్యతగా బిఎస్ఎన్ఎల్ చేపట్టే కార్యక్రమాలను, వాటిద్వారా కలిగే నష్టాలను సమీక్షించాలని కూడా డిఓటి భావిస్తోంది.

బిఎస్ఎన్ఎల్‌కు ప్రస్తుతం 9 కోట్ల సెల్ కనెక్షన్లు, 50 లక్షల విల్ ఫోన్లు, 2.5 కోట్ల లాండ్‌లైన్ కనెక్షన్లు వున్నాయి. బిఎస్ఎన్ఎల్‌కు ఉద్యోగుల మెడికల్ ఖర్చుల రూపేణా గత సంవత్సరం 484 కోట్లు ఖర్చు కాగా, ఈ సంవత్సరం ఈ మెడికల్ ఖర్చు 548 కోట్లు అయింది.

*బిజినెస్ స్టాండర్డ్, 7-12-2011*

## పెన్షనర్ల ఖర్చు ఎంత?

- ❖ ప్రస్తుతం డిఓటిలోనూ, ఆ తర్వాత బిఎస్ఎన్ఎల్ లోనూ కలిపి రిటైరైన ఉద్యోగుల సంఖ్య రెండు లక్షలుగా వుంది. 2010-11 సం॥నికి పెన్షను చెల్లింపుల రూపంలో డిపార్ట్‌మెంట్ ఆఫ్ టెలికం శాఖకకు 3700 కోట్లు ఖర్చయింది. కాగా 2011-12 ఆర్థిక సం॥నికి పెన్షను ఖర్చు 3959 కోట్లు అవు తుంది. 2006-07 సం॥లో ఈ ఖర్చు 1395 కోట్లుగా వుండేది. 2004-05 సం॥లో పెన్షనర్ల సంఖ్య 1,56,000 వుండగా ఈ సంఖ్య 2008-09 సం॥నికి 1,81,000గా వుంది.
- ❖ ప్రస్తుతం బిఎస్ఎన్ఎల్ పెన్షను కంట్రిబ్యూషన్ రూపంలో ఉద్యోగి స్కేలు యొక్క మాగ్జిమం పై 10% చెల్లిస్తోంది. కాగా బిఎస్ఎన్ఎల్ గత కొంతకాలంగా ఉద్యోగి బేసిక్ వేతనంపై 10% పెన్షను కంట్రిబ్యూషనుగా చెల్లించాలని డిమాండ్ చేస్తోంది. ఈ డిమాండ్‌ను అంగీకరిస్తూ బేసిక్ వేతనంపై పెన్షను కంట్రిబ్యూషన్ చెల్లింపునకు ఆదేశాలను డిఓటి జారీ చేశాయి. బిఎస్ఎన్ఎల్ఇయు జెఎసి ఆధ్వర్యంలో సాధించిన మరో విజయం ఇది.

# సర్కిల్ సమాచారం

## శ్రీకాకుళం బదిలీల అంశం - ఎన్ఎఫ్టిఇ నైచ్యం

శ్రీకాకుళం జిల్లాలో మొత్తం 52 మంది ఉద్యోగుల బదిలీలకు మేనేజ్మెంటు అంగీకరించడం జరిగింది. ఇందులో అన్ని యూనియన్ల సభ్యులూ ఉన్నారు. కాగా ఈ 52 మందిలో ముందుగా 36 మంది ఉద్యోగులకు బదిలీ ఉత్తర్వులు ఇచ్చారు. మిగతా 16 మందికీ కౌన్సిలింగు ద్వారా బదిలీలు ఇవ్వాలని నిర్ణయించారు. ఈ దశలో కౌన్సిలింగును ఆపటానికి ఎన్ఎఫ్టిఇ ప్రయత్నించటం జరిగింది. కౌన్సిలింగు నిర్వహించాల్సిన తేదీన ఎన్ఎఫ్టిఇ మేనేజ్మెంటుతో సుదీర్ఘంగా చర్చించడం, ఏదో కుట్ర జరగబోతోందన్న ఆలోచనతో చర్చలకు తమనూ పిలవాలని బిఎస్ఎన్ఎల్ఇయు కోరటం జరిగింది. కాగా మేనేజ్మెంటు ఎన్ఎఫ్టిఇ నాయకులు వుండగానే బిఎస్ఎన్ఎల్ఇయును పిలవటం, ఎన్ఎఫ్టిఇ నాయకులు బిఎస్ఎన్ఎల్ఇయు నాయకులను దుర్భాషలాడటం జరిగింది. సర్కిల్ యూనియన్, సర్కిల్ మేనేజ్మెంటు జోక్యంతో కౌన్సిలింగు నిర్వహించడం జరిగింది. కౌన్సిలింగుకు హాజరు కాని కొంతమంది ఎన్ఎఫ్టిఇ సభ్యులు కోర్టుకు వెళ్ళటం, కోర్టు వారి అభ్యర్థనను తిరస్కరించడం జరిగింది. కాగా కోర్టు ఉత్తర్వుల మేరకు మిగిలిన బదిలీ ఉత్తర్వులు ఇవ్వటం జరిగింది. కోర్టు ఉత్తర్వుల అంశాన్ని దాచివేసి, ఎన్ఎఫ్టిఇ లేబరు కమీషనరు వద్దకు వెళ్ళటం, ఎఎల్సి బదిలీ అబయెన్స్లో పెట్టడం జరిగింది. కోర్టు ఉత్తర్వుల అంశాన్ని సర్కిల్ యూనియన్ ఎఎల్సి దృష్టికి, సర్కిల్ మేనేజ్మెంటు దృష్టికి తీసుకు వెళ్ళటంతో బదిలీలపై ఇచ్చిన అబయెన్సును రద్దు చేశారు.

కాగా బిఎస్ఎన్ఎల్ఇయు నాయకులు తమ యూనియన్ నాయకులపై హత్యాయత్నం చేశారని జాతీయస్థాయిలో కంప్లైంట్ చేసింది ఎన్ఎఫ్టిఇ. యూనియన్ను నడిపే క్రమంలో చేయాల్సిన పనులను ఎన్ఎఫ్టిఇ ఆత్మసాక్షికి, విజ్ఞతకే వదిలేద్దాం.

## పశ్చిమ గోదావరి జిల్లాలో బిఎస్ఎన్ఎల్ఇయు విజయవంతమైన పోరాటం - ఎన్ఎఫ్టిఇ ద్వంద్వవైఖరి

బదిలీలలోనూ, స్థానిక సమస్యల పరిష్కారం కోసం బిఎస్ఎన్ఎల్ఇయు పశ్చిమ గోదావరి జిల్లా శాఖ స్థానిక ఆందోళన కోసం నోటీసు ఇచ్చింది. స్థానికంగా బలంగా వున్న ఎన్ఎఫ్టిఇ నాయకుల ఒత్తిడికి లొంగిన మేనేజ్మెంటు సమస్యల పరిష్కారంపై నిర్లక్ష్యం చూపింది.

దాంతో సర్కిల్ యూనియన్ సూచనల మేరకు బిఎస్ఎన్ఎల్ఇయు ఏలూరు శాఖ ఆందోళన చేసి సమస్యలను పరిష్కరించేలా మేనేజ్మెంటుపై ఒత్తిడి తేగలిగింది.

బిఎస్ఎన్ఎల్ ఎంప్లాయీస్ యూనియన్ చొరవతో బదిలీలపై ఆంధ్రప్రదేశ్ సర్కిల్లో సవరించిన ఉత్తర్వులు ఈ సంవత్సరం అమలయ్యాయి. ఈ బదిలీల ఉత్తర్వులు అన్యాయమనీ, చెల్లవనీ, ఎన్ఎఫ్టిఇ, ఎ.పి. సర్కిల్ యూనియన్ మరియు ఎన్ఎఫ్టిఇ జాతీయ స్థాయిలోనూ కంప్లైంట్ చేశాయి. కాగా ఈ బదిలీ ఉత్తర్వుల కారణంగా దాదాపు 100 మందికి ఏలూరులో బదిలీ ఉత్తర్వులు ఇచ్చారు. ఇది తన విజయంగా ఎన్ఎఫ్టిఇ జిల్లాశాఖ నోటీసు బోర్డులలో పేర్కొంది. ఈ అంశంపై ఎన్ఎఫ్టిఇ రాష్ట్రశాఖ ఆందోళన కూడా చేసింది. ఇంతకూ ఎన్ఎఫ్టిఇ జిల్లాశాఖ కరెక్టా లేక రాష్ట్రశాఖ కరెక్టా?

## కరీంనగర్ జిల్లాలో ఆందోళన - సర్కిల్ జెఎసి జోక్యంతో సమస్య పరిష్కారం

బిఎస్ఎన్ఎల్ ఎంప్లాయీస్ యూనియన్ కరీంనగర్ జిల్లా శాఖ స్థానిక సమస్యల పరిష్కారం కోసం ఆందోళన కార్యక్రమానికి నోటీసు ఇచ్చింది. దీనిపై చర్చలకు మేనేజ్మెంటు పిలిచినా, ఈరోజు, రేపు అని కాలయాపన చేసింది. దీనిపై బిఎస్ఎన్ఎల్ఇయు జిల్లా యూనియన్ ఆందోళనకు దిగింది. కానీ స్థానిక రాజకీయ నాయకుల జోక్యం చేసుకొని, అసంతృప్తికర పరిస్థితులను సృష్టించారు. ఈ పరిస్థితుల నివారణకు, సామరస్య పూర్వక వాతావరణం సృష్టించడానికి సర్కిల్ జాయింట్ యాక్షన్ కమిటీ 3.12.2012న కరీంనగర్ వెళ్ళి అపార్థాలు తొలగించడానికి, మేనేజ్మెంటుతో సామరస్యపూరిత వాతావరణం ఏర్పడటానికి తగిన పరిస్థితులు కల్పించడానికి తగిన చర్యలు తీసుకోవాలని ఇరు వర్గాలకు విజ్ఞప్తి చేశారు.

# LETTERS FROM ADMINISTRATION

## ఫ్యామిలీ పెన్షనులో సవరణలు చేస్తూ, విడాకులు తీసుకున్న కూతుళ్ళకీ వికలాంగులకీ వర్తింపజేస్తూ ఇచ్చిన ఉత్తర్వులు

**No. 40-13/2011-Pen(B)** **Dated: 08-11-2011**

**SUB:** Extension of scope of family pension to widowed/unmarried daughter and dependent disabled siblings of Central Government Servants/Pensioners.

Sir,

I am directed to refer to this office letter of even no, dated 28-6-2011 (circular no-11) in which clarification on the above mentioned subject from Ministry of Personnel, Public Grievances & Pensions, Department of Pension and Pensioners' Welfare's vide their OM No-1/13/09-P&PW(E) dated 28th April 2011 had been circulated for taking further necessary action.

2. It is seen that there is a general lack of clarity on the issues involved in various field units of BSNL. However, in order to bring about clarity in this regard, salient features of these instructions are reproduced below: -

(i) As per the existing provisions, the son/daughter of a Govt. servant/Pensioner is eligible for family pension up to the date of his/her marriage/remarriage or till he/she starts earning or till the age of 25 years, whichever is earlier, A disabled son/daughter of a Govt. Servant/Pensioner suffering from any disorder or disability of mind, including mentally retarded, or who is physically crippled or disabled is eligible for family pension for life.

(ii) Divorced/widowed daughters are eligible for family pension even after attaining the age limit of 25 years. Family pension to wido.ved/divorced daughters is admissible irrespective of the fact that the divorce/ widowhood takes place after attaining the age of 25 years or before.

(iii) However, an unmarried daughter of a Govt, servant / Pensioner beyond 25 years of age, has been made eligible for family pension at: par with the widowed/divorced daughter subject to fulfillment of certain conditions. Family pension to the widowed/divorced/unmarried daughters shall, however, be payable in order of their date of birth and the younger of them shall not be eligible for Family Pension unless the next above has become ineligible for grant of family pension.

(iv) The family pension to widowed/divorced/unmarried daughters above the age of 25 years, shall be payable only after the other eligible children below the age of 25 years have ceased to be eligible to receive family pension and that there is no disabled child to receive the family pension.

(v) Dependent disabled siblings of a Govt, servant/pensioner have been made eligible for family pension for life.

(vi) The widowed/divorced/unmarried daughter of a Govt, servant/ Pensioner, will be eligible for family pension with effect from the date of issue of respective orders irrespective of the date of death of the Govt. servant/Pensioner . Financial benefits in such cases will accrue from the date of issue of respective orders. The cases of dependent disabled siblings of the Govt. Servants/Pensioners would also be covered on the above lines.

3. All Heads of Circles are requested to arrange to settle the family pension claims of widowed/

divorced/unmarried daughters and dependent disabled siblings Strictly according to the clarifications and various associated/attendant conditions as mentioned in the DOP&PW O.M. No.1/13/09-P&PW(E) dated 23th April 2011 (copy enclosed for ready reference on priority.

---

## బ్యాడ్ క్లైమెట్ అలవెన్సు శాంక్షను చేస్తూ ఇచ్చిన ఉత్తర్వులు

**No. TA/EST/2-24/Rlgs/11-12/Vol-II** **Dated: 14-11-2011**

To
The GMTD, Adilabad / East Godavari / Khammam / Mahaboobnagar / Srikakulam, Visakhapatnam / Vizianagaram / Warangal / West Godavari,

**Sub:** List of notified villages eligible for payment of Bad climate Allowance - reg.

Instructions have issued regarding grant of Bad Climate Allowance for the BSNL staff vide this office letter no. TA/EST/2-24/Rlgs/09-10 dated 18-04-2011.

In continuation of the above instructions the list of villages and schedule areas eligible for payment of Bad Climate Allowance, issued by Ministry of Finance, (Extract taken from Swamy's FR & SR Part - V) is enclosed herewith.

The applicability of (allowances will be as per the instructions contained in Corporate Office orders mentioned hereunder.

1) Letter No. 1-33/2008-PAT (BSNL)/Comp. Allowance/4, dated 04-09-2009 for Executives
2) Letter No. 1-16/2010-PAT(BSNL), dated 07-05-2010, for Non-Executives

This issues with the approval of Chief General Manager.

---

## రాష్ట్రవ్యాప్త ఆందోళనను విరమించుకోమని అభ్యర్థిస్తూ సర్కిల్ మేనేజ్ ఇచ్చిన అప్పీలు

## APPEAL

Dear Sri Sampath Rao,

**Sub: Notice for agitation program being conducted by BSNLEU AP Circle - Regarding.**

This has the reference to your Lr.No. BSNLEU/AP CIRCLE/10-II/CGMT Corr, dated 28-11-2011 regarding agitation program as given below:

| | |
|---|---|
| 19-12-2011 | Gate Demonstrations with black badges |
| 20-12-2011 | Dharna's at SSA Leve |
| 27-12-2011 | Press Meetings and Rallys |
| 06-01-2012 | Hunger Strike by the Circle Secretary at % CGMT Hyderabad |

The issues raised by you are already under various stages of process / implementation etc.

The issues pertaining to Corporate Office are being taken up with Corporate Office. Regarding remaining valuable issues pertaining to A.P. Circle suggested by you in the larger interest of BSNL, we shall hold a meeting on 26-12-2011.

Any type of agitational action at this stage will not only affect financial viability of the company but also bring bad image to the organization. The agitational steps would do more of harm to organization as customers feel the impact of such steps. In such a situation I would request you not to resort to agitation as the issues can be sorted out.

In order to maintain cordial relations and in the interest of organization, I would request you to refrain from agitating by withdrawing your notice and have the issues resolved through mutual discussions proposed on 26-12-2011.

ఒక్కడు... ఒకే ఒక్కడు
ఎన్ఎఫ్‌టిఇ దుష్ట చతుష్టయం నుంచి బయటపడ్డాడు
వారి కుట్రలను బయటపెట్టాడు

కార్మికులను ఒక్కబాటలో నడిపించాడు
బిఎస్ఎన్ఎల్ఇయును గెలిపించాడు

కామ్రేడ్స్ గుండెల్లో గూడు కట్టుకున్నాడు
అధికారుల గుండెల్లో గుబులు పుట్టించాడు

జూలు విదిలిస్తే మన జూలపల్లి
కదులుతుంది అధికారగణం భయంతో భీతిల్లి

ఒకటి కాదు... రెండు కాదు... మూడు కాదు... కామ్రేడ్ సంపత్‌రావ్‌జీ
నాలుగుసార్లు... వరుసగా నాలుగుసార్లు బిఎస్ఎన్ఎల్ఇయును గెలిపించావు
నీ సత్తా ఏమిటో చూపించావు
ప్రత్యర్థి ఎన్ఎఫ్‌టిఇని ఖంగు తినిపించావు
గెలుపులో మన రాష్ట్ర ఓట్లు భాగస్వామ్యమే ఎక్కువని నిరూపించావు
కేంద్రంలో మనకంటూ ఒక ప్రత్యేక గుర్తింపు తెచ్చావు

కామ్రేడ్ సంపత్‌రావుజీ ఇక నీవు ఉద్యోగంలోకి రావు
అయినా... ఉద్యోగుల గుండెల్లోంచి బయటకు పోవు
కాగితాలకే పరిమితం ఈ రిటైర్మెంటు
యూనియన్ సేవకు వేదిక రిటైర్మెంటు

కార్మికసేవయే నీకు తోవ
అందుకు ఆ దేవుడివ్వాలి నీకు చేవ
సాహసి, సమర్థుడైన మా రాష్ట్ర కార్యదర్శి
నీవే సదా మా బిఎస్ఎన్ఎల్ఇయు నావకు మార్గదర్శి

సర్కిల్ కార్యదర్శి ఉద్యోగ విరమణ సందర్భంగా...

**కె.వి.కె. సత్యనారాయణ,** ఎస్ఎస్ఎస్(ఓ), సర్కిల్ ఆఫీసు

***"Choose your mobile numbers"* స్కీమ్‌ని దేశవ్యాప్తంగా అమలుచేసే పథకాన్ని ప్రారంభించడానికి బిఎస్ఎన్ఎల్ సిఎండి శ్రీ ఆర్.కె. ఉపాధ్యాయ్ 15 డిసెంబర్ 2011న హైదరాబాద్ వచ్చారు. ఈ సందర్భంగా అన్ని యూనియన్లూ అసోసియేషన్లూ కలిసి సిఎండికి మెమొరాండం సమర్పించాయి. రాష్ట్రంలో టెలికం పరికరాల సరఫరాని మెరుగుపర్చాలనీ, ఎంతోకాలంగా ఒకే జిల్లాలో వున్న జిఎంలను మార్చాలనీ, కారుణ్య నియామకాలు వెంటనే భర్తీ చేయాలనీ ఈ సందర్భంగా కోరాయి.***

Printed and Published by J. Sampath Rao on behalf of BSNL Employees Union, A.P. Circle, Room No.207, Triveni Complex, 1st Floor, Abids, Hyderabad-01. Ph.: 040 2475 4896 and Printed by him at Sri Sai Tirumala Printers, D.No. 1-8-556/2, Opp. Fantoosh Showroom, Behind Odian Theatre, Chikkadpally, Hyderabad. Phone: 040-66637672
No. 2453 of 2002, dt. 7-12-2002